సమాధానం

శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావు

రాస్తూ రాస్తూ చటుక్కున ఆగిపోయి ఆకాశం లోకి చూస్తూ ఆలోచించసాగాడు శ్రీపతి.

ఇందాకటినుంచి అతని కలం ఎడతెగకుండా సాగి పోతున్నది. సందేహాలకు తావియ్యకుండా ప్రవాహ వేగంగా పరిగిడిపోయింది. కాని యిప్పుడు వ్రాయటం ఆపి ఆలోచించటంలో నిమగ్నమయ్యాడు శ్రీపతి.

కిటికీలోంచి దూసుకువచ్చినగాలికి పేపరు వెయిట్ క్రిందవున్న కాగితాలు రెపరెప కొట్టుకున్నాయి. అతని జుట్టు ముందుకుతూలి కళ్లమీద పడింది.

"వెధవగాలి" అనుకున్నాడు జుట్టు పైకి ఎగ దోసుకుంటూ శ్రీపతి.

ప్రక్క యింట్లోంచి రేడియో శాస్త్రీయ సంగీతం వినిపిస్తోంది. శ్రీపతి ఒకసారి చెవులు మూసు కున్నాడు. "పాడురోద, రోజూ వినలేక ప్రాణం పోతూంది. ఈ వెధవ గాలికితోడు యిదొకటి" అని విసుక్కుంటూ లేచి కిటికీ తలుపులు మూసి వేశాడు.

పూర్తిగా సఫలీకృతుడు కాలేకపోయాడు. సంగీతం యింకా సన్నగా వినిపిస్తోంది.

శ్రీపతి తిరిగి ఆలోచనల్లో నిమగ్నమయి పోయాడు.

"ఏమిటి ఆలోచన ?" శ్రావ్యమైన గొంతు ప్రశ్నించింది.

తలఎత్తిచూశాడు శ్రీపతి - పార్వతి. శ్రీపతి జవాబివ్వకుండా ఆమె కళ్ళలోకి చూశాడు.

"మాట్లాడరేం ?"

శ్రీపతి ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాడు. "ఊఁ... ఆలోచిస్తున్నాను" అన్నాడు.

పార్వతి చిన్నగా నవ్వింది. ఆమె తెల్లని పలు వరుస మిలమిల మెరిసింది. "బాగానేవుంది మీ సమాధానం. మీ ఆలోచన ఏమిటని నేనడిగితే...?" అంటూ అతను కూచున్న కుర్చీమీద చేతులు ఆన్చి నిలబడింది.

శ్రీపతికూడా నవ్వాడు. "చిక్కు వచ్చిపడింది. కథ చివరివరకూ వచ్చిం తర్వాత ఏవిధంగా ముగిం చాలో తెలియటంలేదు" అన్నాడు తరువాత.

"అంటే ? కథముందు ఆలోచించకుండానే ప్రారంభించారా ?"

"ఊహు. ముందు ఆలోచించుకునే ప్రారం భిస్తాను. అయితే ముందుకుపోతున్నకొద్దీ ఊసర విల్లిలాగా రంగులు మారుస్తుంది. ఏంచెయ్యను ?" అన్నాడు ఆలోచించటానికి ప్రయత్నిస్తూ అతను.

"సరే. తర్వాత తీరిగ్గా ఆలోచించుదురుగాని యిప్పటికి లేచిరండి."

"అబ్బే, ఏదో ఒకటి తేల్చుకోకుండానే ?"

"సాయంత్రంపూటకూడా ఎక్కడికీ పోకుండా కథలురాస్తూ కూచుంటారా ? ఎవరు ఎలాపోయినా మీకు సంబంధంలేదు. మీ కథలు మట్టుకు మీకు కావాలి. మిగతా ప్రపంచంతో సంబంధంలేకుండా" అన్నది పార్వతి గాద్గదికంగా. ఆమె నేత్రాలమాటున రెండు నీటి బిందువులు అంకురించాయి.

శ్రీపతి ఆమెవంక చూడటానికి ప్రయత్నించ లేదు. సన్నగా వినవస్తూన్న సంగీతాన్నివిని లీన మయి పోయేందుకు ప్రయత్నించాడు. సాధ్యపడ లేదు.

"కాస్త ఆ సంగీతం ఆపుచేయమని చెపుదూ — రోజూ వినలేక చచ్చిపోతున్నాను" అన్నాడు.

"వాళ్ళ నవటానికి మనకేం అధికారంవుంది? అయినా మీ గొడవతప్ప యింకో గొడవ ఆలకించటం చేతకాదుగా మీకు. ఆ సంగీతం మాత్రం ఎలా వినిపించింది?" అన్నది పార్వతి అతనివంక సూటిగా చూస్తూ — శ్రీపతి జవాబివ్వలేదు. ఆమె వంక చూసి వూరుకున్నాడు.

పార్వతి నవ్వు తెప్పించుకునేందుకు ప్రయత్నిస్తూ అంది, "పోనీ మీ సందేహమేమిటో చెప్పండి. తీర్చేందుకు ప్రయత్నిస్తాను."

శ్రీపతి విస్తుపోయాడు. పార్వతి యింతకు ముందెప్పుడూ యిలా అడగలేదు. తన కథల్ని చూసి ఆమె విసుక్కోవటం మాత్రం తనకు తెలుసు.

"సమాధానం చెప్పగలవా?" అని అడిగాడు.

"ప్రయత్నిస్తాను."

"అయితేవిను. అతనిది అదోవిధమయిన ప్రకృతి. సరిగ్గా యింట్లోవుండడు. అలాగని పాడయిపోయాడనీ చెప్పలేం. ఎక్కడెక్కడో తిరిగి అప్పుడప్పుడూ మాత్రం యింటికి వస్తూవుంటాడు. భార్య అంటే అతనికి ప్రేమవుంది. అయితే అతనా ప్రేమని ఆచరణలో పెట్టలేడు. అంటే తన ప్రేమను ప్రదర్శించుకోలేడన్నమాట. ఇదంతా క్లుప్తంగా ఎందుకు చెప్తున్నానంటే అసలు నువ్వు చెప్పవల్సిన సలహాతో యీ విషయం ఎక్కువ ప్రాముఖ్యం లేదు కాబట్టి"

"ఊఁ" అని ఆపాడు.

"ఆమెకూ అంటే భార్యకూ అతనంటే ప్రేమే. అయితే తనను సుఖపెట్టలేని భర్తతోవుండి ఏంలాభం అని వలపోసింది. చాలాకాలం బాధపడే యీ నిశ్చయానికి వచ్చిందనుకో. కథ రాయటంలో నా కిక్కడే వచ్చింది చిక్కు. ఆమె మొదట పతివ్రతే అయినా భర్త తన పట్ల చూపుతున్న ప్రవర్తనను బట్టి అతనిమీద అయిష్టం పుట్టి, చివరికి ఏవగింపుకూడా కలిగి మరొకడితో సంబంధం ఏర్పరుచుకుని అతనితో వెళ్ళిపోయేటట్లు చేయటమా? లేకపోతే—"

"లేకపోతే?"

"జీవితంమీద విరక్తిపుట్టి, భర్తకు ద్రోహం చెయ్యటం యిష్టంలేక ఆత్మహత్య చేసుకునేటట్లు చేయటమా? ఇదే తెలియకుండావుంది. ఏది వ్రాస్తే బావుంటుంది?"

పార్వతి ఒక నిమిషం మాట్లాడలేదు. తర్వాత ఒక నిట్టూర్పువిడిచి అన్నది! "మీ మొదటి అభిప్రాయం ఏ మాత్రం సమంజసంగాలేదు. భర్త ప్రేమగా చూడనంత మాత్రాన పరాయి పురుషుడితో వెళ్ళిపోవటమనేది సాధారణ విషయంకాదు."

"నిజమే. కాని అతనివల్ల సంసార సుఖం ఏ మాత్రం లేనప్పుడు అంతకుతప్ప ఏంచేస్తుంది? తన జీవితాన్ని సుఖడోలికల్లో ఓలలాడేటట్లు చేయటానికి ప్రయత్నిస్తుందా? లేక ఆత్మహత్య చేసుకుని జీవితం భగ్నం చేసుకోవటానికి 'యత్నిస్తుందా? బాగా ఆలోచించు" అన్నాడు శ్రీపతి.

"ఆడదాన్ని అంత నీచమైన దానిగా ఎందుకు భావిస్తున్నారు మీరు?" అని అడిగింది చటుక్కున పార్వతి. శ్రీపతి తెల్లబోయి ఆమెవంక చూశాడు.

"ఆడది అంత నీచమైనదిగా భావించారా? భర్త సరిగ్గా చూడనంత మాత్రాన మానమర్యాదల సంగతి ఆలోచించకుండా అవినీతికరమైన పనిచేయటానికి సంకల్పిస్తుందని ఎందుకనుకుంటున్నారు?" అని తిరిగి రెట్టించింది పార్వతి.

"అంటే? నా అభిప్రాయం పొరపాటంటావా?"

"పూర్తిగా"

శ్రీపతి కొంచంగా నవ్వాడు. "నువ్వింకా పెరటి దారినే వున్నావు పార్వతీ. సావిత్రి, చంద్రమతుల్ని దృష్టిలో వుంచుకుని మాట్లాడుతున్నావనుకుంటాను" అన్నాడు.

పార్వతి ముఖం ఎర్రబడింది. కళ్లు వింతమార్పును పొందాయి. "కాలం మారిపోయినంత మాత్రాన మనుష్యుల ప్రవర్తనలుకూడా పూర్తిగా మారిపోయాయని అనుకోవటం శుద్ధపొరపాటు. జీవితంమీద విరక్తికలిగి ఆత్మహత్య చేసుకోటానికి సావిత్రి, చంద్రమతులతోపోల్చ నక్కర్లేదు. అభిమానంగల ఏ ఆడదైనా చేస్తుంది ఆ పనిని" అన్నది కొంచం కఠినంగా.

శ్రీపతి ఆమెవంక తీక్షణంగా చూశాడు.

"అటువంటివారున్నారు. లేరనను. కానిలోకంలో ఎక్కడో జరిగే విషయం తీసుకోవటంకన్నా కళ్ళ ముందు జరిగే విషయాన్ని కథా వస్తువును తీసుకుంటే అది సహజంగా వుంటుందనుకుంటాను పార్వతీ. ఈ విషయానికి ఆత్మహత్య చేసుకున్నదనిరాస్తే అది అసహజంగా కనబడవచ్చు."

పార్వతి ఒక క్షణం జవాబివ్వలేదు. తర్వాత అన్నది "మీరు యిన్ని కథలు రాశారు. అవన్నీ ఊహాకల్పితాలే. యదార్థ జీవితంలోని విషయాలు తీసుకొని మీరు ఏ ఒక్కటీ రాయలేదని నా అభిప్రాయం. లోకాన్ని లోకపరిస్థితుల్ని, వ్యక్తుల మనస్తత్వాల్ని అవలోకనా దృష్టితో పరిశీలించటం నేర్చుకుంటే అసలీ సందేహం మీ మనస్సుకు తట్టేది కాదేమో."

శ్రీపతి నవ్వాడు. "కాస్త విశ్రాంతి తీసుకో పార్వతీ. అంత ఆవేశ పూరితంగా మాట్లాడబోక" అన్నాడు.

పార్వతి తన ఆవేశానికి కొంచంగా సిగ్గుపడింది. "నువ్వేది చెప్పినా నాకు అలా రాయటం సమంజసంగా కనబడటంలేదు. నేను మొదట అనుకున్న ప్రకారంగానే రాస్తాను" అన్నాడు ఒక క్షణం ఆగి శ్రీపతి.

పార్వతి యీసారి చాలా తగ్గుస్థాయిలో "మీ యిష్టం. కాని అబద్ధాలురానేకంటే అసలీకథను రాయటమే మానివేయండి" అన్నది. ఆమె కంఠంలో ఎంతో తీక్షణత వుట్టిపడింది.

శ్రీపతి మాట్లాడలేదు. రెండు నిమిషాలు నిశ్శబ్దంగా దొర్లాయి. "సరే. ఆలోచించి రాస్తాను తర్వాత. మనస్సులో తర్క వితర్కాలు చేసుకోవాలి" అన్నాడు.

"ఇంకా యిప్పుడు రాయరుగా"

"ఊహూ"

పార్వతి గబగబ కాగితాలు, కలంతీసి డ్రాయరులో పెట్టేసింది. సంగీతం ఆగిపోయిందేమో, శ్రీపతి కిటికీ తలుపులుతీసి బయటకి చూస్తున్నాడు.

"ఏమండీ ?" ఎంతో మాధుర్యం వుట్టిపడుతూ, మృదువుగా అన్నది పార్వతి. శ్రీపతి ఆమెవంక చూశాడు. ఇందాకటి ఆవేశంలేదు ఆ ముఖంలో. ప్రశాంతత, సిగ్గు ఉట్టిపడుతున్నాయి.

"ఏమిటి ?"

"నేనొకటి అడగనా ?"

"ఊఁ"

"ఇవేళ ... ఇవేళ సినిమాకి పోదామా ?" పార్వతి అడగలేక అడిగింది.

శ్రీపతి విస్తుపోయాడు. ఇందాకటి పార్వతికీ యిప్పటి పార్వతికీ ఎంతో వ్యత్యాసం కనిపిస్తూంది తనకి. ఇందాక ... ఏమిటో ! ఎలాగో కనిపించింది.

చటుక్కున ఒక విషయం గుర్తువచ్చిందతనికి. "అరెరె — ఆ విషయం మరిచేపోయానే" అంటూ లేచాడు చప్పున.

"ఏమిటి ?"

"సత్యం యిప్పుడు రమ్మన్నాడు. ఇద్దరంకలిసి సినిమాకి పోదామనుకున్నాం. ఇంతకీ యిప్పుడు

నువ్వు సినిమా అంటే జ్ఞాపకం వచ్చింది" అన్నాడు త్వరపడుతూ.

పార్వతి ముఖం మాడిపోయింది. కనుకొనలలో తిరిగిన నీరును కష్టంమీద ఆపుకుంది.

శ్రీపతి ఆమె ముఖంవంక చూశాడు. దగ్గరకు వచ్చి చుబుకాన్ని స్పృశిస్తూ అడిగాడు.

"కోపమా ?"

పార్వతి మాట్లాడలేదు. అతనిమీదనుంచి దృష్టి మరల్చుకుంది.

"వచ్చేస్తాను. మీ స్నేహితు లెవరితోనయినా వెళ్ళు పార్వతీ? ఇందాక వస్తానని చెప్పాను. తప్పితే బాగుంటుందా యిప్పుడు?" అన్నాడు శ్రీపతి. తరువాత బట్టలు మార్చుకునేందుకు లోపలకి పోయాడు.

'మళ్లోపావుగంటకల్లా బయల్దేరాడు శ్రీపతి. "నా కోసం యింట్లో వుండక్కర్లేదులే పార్వతీ. నువ్వుకూడా వెళ్ళు సినిమాకి" అని చెప్పాడు వెళ్తూ. పార్వతి మాట్లాడలేదు. ఆమె ముఖాన కళ లేదు.

పార్వతి అలా చాలాసేపు బయటకు చూస్తూ నిలబడిపోయింది. ఆమె కన్నులనుండి రెండు నీటి చుక్కలు రాలి క్రింద పడ్డాయి.

♦ ♦ ♦

రాత్రి పదిగంటలవరకూ అతనికోసం ఎదురు చూస్తూ కూచుంది పార్వతి.

తను భోజనమయినా చేయలేదు. కిటికీముందు కుర్చీలో కూచుని నిశీథంలోకి స్ట్రీట్ లైట్సువంకా, ఆకాశంలో మెరిసే చుక్కలవంకా చూస్తూ ఆలోచిస్తున్నది.

ఏం మనిషి? తన సంగతే పట్టించుకోకుండా అలా దూర దూరంగా తిరుగుతాడేం? తనంటే ఎందుకు కోపం? అతనికేం లోపం చేసింది? తనంటే యిష్టంలేదా?

ఈ ప్రశ్నకు పార్వతి సమాధానం ఆలోచించుకోలేకపోయింది. అతని ప్రతిచేష్టలో యిష్టం పుట్టి పడుతూ వుంటుంది. తన మనస్సుకు కష్టంకలిగేటట్లు ఏనాడూ అతను మాట్లాడలేదు. మాటలవరకే!

కొందరి కొందరి మనస్తత్వాలు విచిత్రంగా వుంటాయని తను పుస్తకాల్లో ఎప్పుడో చదివింది. తన భర్తకూడా ఆ విచిత్ర మనస్తత్వంగల వాళ్ళ లెక్కలోనే జమ అనికూడా అనుకోవల్సి వచ్చింది యిప్పుడు. అయినా మట్టుకు యింత ఆలనా పాలనా లేకుండా జీవితాన్ని గడపటమా?

ప్రక్క యింట్లో యిందాకటినుంచీ వినవస్తున్న శాస్త్రీయ సంగీతం ఆగిపోయింది. ఇంగ్లీషు మ్యూజిక్ ఏదో జంఝూఘూటంగా వినిపిస్తోంది.

విచిత్ర మనస్తత్వం ఎలా వుంటుంది? వాళ్లకి ఐహిక విషయాలేంపట్టవా? కథలు చిత్రించటంలో వున్న ప్రయోజకత్వం, సమర్థత నిత్యజీవితంలో వుండవా? అదే ప్రపంచం కాబోలు.

పార్వతి తలఎత్తి ఆకాశంవంక చూసింది. కిటికీ అడ్డుండటంవల్ల చందమామ కనుమరుగైపోయాడు. పార్వతి ఏదో గుర్తు తెచ్చుకోవటానికి ప్రయత్నించింది.

మొన్ననే ఆయనేదో గేయం అల్లారు. అందులోని భావం మాత్రం తనకు కొంచంగా గుర్తు వస్తూన్నది. "ఎందుకట్లా నవ్వుతావు చందమామా? నాస్థితిని చూచేవా? నన్నువిడిచి ఆయనెక్కడో దూరదేశాల్లో వున్నారు. నేనీ వియోగాన్ని సహించలేకుండా వున్నానని, ఈ విరహబాధ సైరింపలేకుండా వున్నాననీ నా సందేశం అందించవా" అని కాబోలు అందులోనిభావం.

పార్వతి నవ్వుకున్నది. తను యిక్కడకి, యీ మనిషి అజమాయిషీ క్రిందకివచ్చి నాలుగేళ్లు. ఈ నాలుగు సంవత్సరాలూ చందమామను చూస్తూ ...

దూరంగా మాటలు వినిపిస్తున్నాయి. "వస్తున్నారు కాబోలు" అనుకుని శ్రద్ధగా ఆలకించింది పార్వతి. మాటలు దగ్గిరపడుతున్నాయి. భర్త కంఠస్వరం ఆనవాలు పట్టింది పార్వతి.

"వస్తాను బ్రదర్. రేపు కలుసుకుందాం. గుడ్ బై"

"ఓ. కే. గుడ్ బై"

స్నేహితుడు చీకట్లో లీనమయిపోయాడు. పార్వతిలేచి తలుపు తీసింది. శ్రీపతి వచ్చాడు లోపలికి.

"ఏసినిమాకి పోయారు ?"

ఈజీఛైరులో కూలబడుతూ శ్రీపతి జవాబు చెప్పాడు. పార్వతికి సరిగ్గా అర్థంకాలేదు.

"నా అభిప్రాయం ఎప్పటికీ తప్పుకాదు. ఆ సినిమాలో ప్రపంచంలో జరుగుతున్న యదార్థాన్ని ఎంత నేర్పుగా చిత్రించాడు ? ఎంత సహజంగా వుంది ?" అని వెనక్కు వాలుతూ నెమ్మదిగా గొణుక్కున్నాడు శ్రీపతి. పార్వతి యీ మాటలు సరిగ్గా వినలేకపోయింది.

"భోజనానికి లేవరూ ?"

శ్రీపతి తలఎత్తి ఆమె వంకచూసి "అరె. చెప్పటం మరిచిపోయాను. సత్యం బలవంతంమీద హోటల్లో తినివచ్చాను. వాడిభార్య వూళ్లో లేదుట. అందుకని హోటల్లోనే భోంచేస్తున్నాడు" అన్నాడు.

పార్వతి అచేతనంగా అతని వంక చూస్తూ నిలబడిపోయింది.

"నువ్వు తిన్నావా ?"

"ఆఁ." పార్వతి యీ మాట ఎంత ఏవగింపుతో అందో ఆమె ముఖాన్నిచూస్తే గుర్తించగలిగేవాడు శ్రీపతి. కాని ఆమె ముఖం ప్రక్కకు తిప్పుకుంది.

శ్రీపతి నిశ్చింతగా చీకట్లోకి చూస్తూ ఆలోచిస్తూ వుండిపోయాడు. పార్వతి చాటుగా కళ్ళు తుడుచుకుంది.

రెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచింది.

"కాళ్ళు కడుక్కుని బట్టలు మార్చుకోండి" అన్నది పార్వతి అతనితో మెల్లిగా.

"ఊఁ" అంటూలేచి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని లోపలికిపోయాడు శ్రీపతి. పార్వతి యింకా అక్కడే వుండిపోయింది కదలకుండా.

మరో అయిదు నిమిషాలకల్లా శ్రీపతి బట్టలు మార్చుకుని వచ్చాడు. పార్వతి యింకా నిలబడి వుండటంచూసి "అరె. ఎంత రాత్రయిందో తెలుసా ? నువ్వు పడుకో" అన్నాడు ఆశ్చర్యంగా. పార్వతి దీనంగా అతనివంక చూసింది. తిరిగి యీజీఛైరులో కూచుంటున్నాడామనిపి.' గిరుక్కున తిరిగి మంచంమీద పడిపోదామా అనిపించింది పార్వతికి. మనస్సు ఎదురు తిరిగింది.

అతికష్టంమీద చిరునవ్వు తెచ్చుకుని అతని దగ్గరకుపోయి నిలబడింది.

"మీరు రారూ ?"

శ్రీపతి ఒక్కసారిగా చల్లబడి కరిగిపోలేదు. ఏదో చెప్దామనుకుని ఆమెవంక చూశాడు.

పార్వతి నవ్వుతూ అతని భుజంమీద చెయ్యివేసి జుట్టులోకి రెండవ చెయ్యి పోనిచ్చి దువ్వుతూ "ఊఁ ?" అంది. ఆమె ముఖంలో దరహాస చంద్రికలు వెల్లివిరిసిపోయినై.

శ్రీపతి భుజంమీదనుంచి నెమ్మదిగా ఆమెచేతిని తీసివేయటానికి ప్రయత్నిస్తూ తిరిగి ఏదో చెప్పబోయాడు.

కాని పార్వతి భుజంమీద చేతిని అలానేవుంచి సున్నితంగా నొక్కుతూ "రారూ" అంది మెల్లగా. ఆమె ముఖంనిండా సిగ్గుతెరలు క్రమ్మివేసినై.

"కథ రాసుకోవాలి పార్వతీ."

ఒక్కసారిగా తృళ్ళిపడింది పార్వతి. ఒక్కసారిగా ముఖం వాడిపోయింది.

"నువ్వు నిద్రపో. నేను రాసుకుని వస్తాను" అన్నాడు తిరిగి శ్రీపతి.

పార్వతి పెద్దగా దెబ్బతింది. అధరాలు కంపించినై. కళ్ళల్లో కోపం, ఏహ్యత, రోషం మొదలయిన భావాలు ప్రతిఫలించి రెపరెప కొట్టుకున్నాయి. ఒక్క విసురున అతని దగ్గరనుంచి కదిలిపోయి మంచంమీద వాలిపోయింది. హృదయం లోంచి దుఃఖం పెల్లుబికింది.

శ్రీపతి యీ విషయం తనకేమీ పట్టనట్లుగా నిశ్చింతగా డ్రాయరులోంచి కలం, కాగితాలు బయటకుతీసి వ్రాయటానికి ఆలోచించసాగాడు.

పార్వతి చటుక్కున లేచి కూచుని అడిగింది. "ఇందాకటి కథేనా రాస్తున్నది?"

"అవును"

"ఏమని నిశ్చయించుకున్నారు?"

"ఏమిటి?"

పార్వతి హృదయంలోంచి ఆవేశం పెల్లుబికింది. "అదే. యిందాకటి కథ ఏవిధంగా ముగిద్దామని అనుకున్నారు?" అన్నది గట్టిగా.

శ్రీపతి ఆమెవంక తాపీగా చూస్తూ "నేను అనుకున్న విధంగానే రాస్తున్నాను. ఏం?" అన్నాడు.

"రాయండి రాయండి" అన్నది పార్వతి చటుక్కున. "వద్దు. పచ్చి అబద్ధం అది. మీ కథల్లో అబద్ధాలు రాస్తారా? అది చదివే వేలాదిమందిని అబద్ధాలచే నమ్మిస్తారా?" అన్నది వెంటనే తిరిగి.

శ్రీపతి ఆమెవంక అర్థంగాకుండా చూశాడు ఒక నిమిషం. తరువాత నెమ్మదిగానే "ఏమిటీ ఆవేశం?" అన్నాడు.

పార్వతి సిగ్గుపడలేదు. "అవును. అబద్ధాలు ఎందుకు రాస్తారు? అలా ఎప్పటికీవద్దు" అన్నది గట్టిగా.

"నీకు తెలీదులే పార్వతీ. ఏవిధంగారాస్తే సహజంగా వుంటుందో, పాఠకుల్ని ఆకర్షిస్తుందో నాకు తెలుసు. మనస్సు బాగా లేనట్లుంది పడుకో" అన్నాడు శ్రీపతి లాలింపుగా.

పార్వతి కోపం వెళ్ళగక్కుతూ అతనివంక ఒకసారిచూసి పక్కమీద వాలిపోయి, దిండులో తలదాచుకుంది. ఆమె హృదయం దహించుకుపోతూంది రెండు విధాలా.

ఇవేళ కథ రాసుకోవాలి. నిన్న తలకాయ నొప్పి ... మొన్న స్నేహితుడిపెళ్ళి ... యింకో రోజు ముసుగు బిగదన్ని నిద్ర ... తర్వాత రోజు...

ఎన్నాళ్ళీ బ్రతుకు? మనసారా బ్రతక్కుండా?

పార్వతి యింక ఆలోచించుకోలేకపోయింది. హృదయం కోపంతోనూ, ఆవేశంతోనూ నిండిపోయి బుసలు కొట్టింది. కన్నీళ్లు ఎడతెగకుండా ప్రవహించి దిండును తడిపివేశాయి. ఆ మంచంమీదనే పడుకుని విలవిల్లాడింది పార్వతి.

శ్రీపతి నిశ్చింతగా కథ రాసుకుపోతున్నాడు.

♦ ♦ ♦

గడియారం కొట్టిన అలారంతో మెలకువ వచ్చింది శ్రీపతికి తెల్లవారుఝాము అయిదు గంటలకి. అతనుయీజీఛైర్ లోనే పడుకుని నిద్రపోయాడు రాత్రి.

"పార్వతీ!" అన్నాడు కళ్లు నులుముకుంటూ అప్రయత్నంగా. అని పార్వతి మంచంవయిపుకు చూశాడు. ఆమె లేదు.

"ఎక్కడకుపోయింది యింత పొద్దున్నే?" అనుకుంటూ లేచాడు శ్రీపతి. రాత్రి పూర్తిచేసిన కథ బల్లమీద పేపరు వెయిట్ క్రింద వుండి గాలికి రెపరెపలాడుతూంది.

"పార్వతీ!" అనిమరోసారి పిలవటం పూర్తికాకుండానే కథపైనమడిచి పెట్టబడివున్న మరోకాగితం కనిపించింది. కంపిస్తున్నచేతుల్తో దాన్ని తీశాడు శ్రీపతి. చదువుతుంటే అతని శరీరం వణికిపోయింది.

మహాశయా!

మిమ్మల్ని అర్థంచేసుకుందామ యిన్నాళ్లనుంచీ ఎంతగానో ప్రయత్నించాను. అయినా సఫలురాల్ని కాలేకపోయాను. చేసుకున్న భార్యనుకూడా ప్రేమించలేని మీ వూహలకు అసలు అర్థంవుందో లేదో కూడా తెలియదు.

ఇన్నాళ్లనుంచీ నా హృదయంలో ఎంతబాధా, ఎంత ఆవేదనా అణిచి పెట్టుకున్నానో మీకు తెలుసునా! మిమ్మల్ని వశంచేసుకుందామని నేనెంత ప్రయత్నించినా నా హృదయాన్ని ఎప్పుడయినా శోధించారా మీరు. శోధిస్తే మనజీవితాలీలావుండేవేనా?

భర్త అనురాగం లేని స్త్రీ ఏంచూసుకుని బ్రతుకుతుంది యింక? ఈనాలుగేళ్ల జీవితంలో ఏ ఒక్క కోరిక తీర్చారు మీరు? కనీసం సరదాగా ఎక్కడికయినా పోదామని అడిగినప్పుడు కూడా ఏదోవంక పెట్టి తప్పించుకుని తిరిగారు? భార్యయందు అనురాగంచూపటమంటే డబ్బుయిచ్చి నీయిష్టమైన చోటికి నువ్వు పొమ్మనటమా? సహపంక్తిని భోజనం ఒక్కనాడయినా లేకుండా మీదారిన మీరు పోయి నన్ను వంటరిగా బ్రతకమని శాసించటమా? డబ్బు, నగలు, చీరలు యివేనా స్త్రీయొక్క వాంఛితాలుగా భావించారు? ఏ స్నేహితుడితోనో కలిసి సినిమానో, నాటకాన్నో చూచి ఆనందిస్తున్నప్పుడు భార్య యింటివద్ద సుఖంగా నిద్రపోతున్నదనే నమ్మారా! చంద్రుడ్ని చూస్తూ, నక్షత్రాల్ని చూస్తూ ఆరు బయట వెన్నెల్లోపడుకుని, భర్తసాన్నిధ్యం లేక విలపిస్తూన్నట్లు ఒకయింటిమ నస్తత్వాన్ని వూహించి రాసిన మీగేయం గుర్తులోవుందా?

తమరు చాలా కథలురాశారు. వాటిలో చాలావరకూ చదివాను. వాటిలో నిత్యజీవితంలో జరుగుతున్న యదార్థాలని ఆధారంగాతీసుకుని రాసినవెన్ని? అన్నీ వూహాగానం చేసి రచించినవేగా. అందుకే మిమ్మల్ని లోకం అందలమెక్కిస్తున్నది. నిజాన్ని రాయటం నిరూపించటం మీకు చేతకాదనుకుంటాను. అందుచేతనే యివేళ వాదోపవాదాలు జరిగిన కథవిషయంలో మీ అభిప్రాయం ఆమాదిరిగా వుంది. కథ ఏ విధంగా రాస్తే రమ్యంగా వుంటుందో అని ఆలోచించారుగాని ఆపాత్రను తరచిచూశారా? నిజజీవితంలో ప్రాణంతోవున్న జీవుల్నే అర్థంచేసుకోలేని మీరు కల్పనాకథలోని పాత్రల్ని అర్థంచేసుకుని రాయగలరా!

గృహజీవితంలో యిటువంటి అనుభవాలికి గురియవుతున్న గృహిణి పరాయిపురుషుడితో పరారయిపోవటమే సవ్యంగా కనిపించిందికదూ. బహుశా యీ కథరాయటం మీరు తలపెట్టకపోతే, తలపెట్టినా సమాధానం కోరకపోయివున్నట్లయితే పర్యవసానం యీ మాదిరిగావుండేదికాదేమో. యావజ్జీవితం సమాంతరాలుగానే మనజీవితాలుగడిచిపోయేవేమో. కాని యీకథ, మీసందేహం, మీ పట్టుదల నన్ను మేల్కొలిపింది. స్త్రీలగురించి, స్త్రీత్వాన్నిగురించి అంతతుచ్ఛంగా భావిస్తున్నారా? కథవిషయంలో మీకున్న అభిప్రాయం నిజంగా ఎప్పుడైనా మీమనస్సుకు తగిలితే నేనెటువంటి అపనిందపాలు కావాలి? ఒకరి ప్రవర్తనలోని లోపం వాళ్లు గ్రహించుకోలేరు. ఎదుటివాళ్లని అపార్థంచేసుకోవటం మాత్రం వాళ్లకు

బాగా చేతనవును. అందుకనే నేను యీ లోకంలో నివశించటానికి భయపడి దూరమయిపోతున్నాను.

లోకంలోని సమస్యల్ని కథావస్తువుగా తీసుకోవటం మీకేమాత్రమో తెలుసును. అయితే వాటికి సరియైన స్వరూపం యిచ్చి చిత్రించటం మీవుచాత కాదు. మీ అభిప్రాయం యిప్పటికయినా మారుతుందనుకుంటాను. మీ అనుభవాన్నయినా ఆధారంగా చేసుకుని సరియైన స్థాయిలో ఆ కథను తిరిగి రచించండి. ఇక సెలవు. నేను చేసినపనిలో పొరబడ్డానని సందేహంనాకు లేదు. ఈ ఉత్తరం మీరుచదివే సరికి నామృతకళేబరం మాత్రం పెరట్లోని బావిలో మునుగుతూనో తేలుతూనో వుంటుంది. నమస్తే."

'పార్వతీ'

దీన్ని చదువుతున్న శ్రీపతి నిలువునాకంపించిపోయాడు. భయంతో ముఖం వివర్ణమయిపోయింది. "పార్వతీ!" అని అరుస్తూ భావిదగ్గరకు పరిగెత్తి లోపలికి చూశాడు.

"పార్వతీ"

ఆ మాటలు భావిలో వెర్రిగా ప్రతిధ్వనించాయి. శ్రీపతి ప్రతిమలాగా అలానే నిలబడిపోయాడు.

"మనం ఒకరొకరు అర్థంచేసుకోలేకపోయాం పార్వతీ" అన్నమాటలు అతని హృదయం అస్పష్టంగా గొణిగింది.

ఈశ్వర సాక్షాత్కారము పొందిన

హనుమాయమ్మగారు

దీర్ఘకాల రోగములకు, ఉన్మాదము (పిచ్చి)నకు ఆధ్యాత్మిక చికిత్సలు (Spiritual cure) చేస్తారు. 2. జీవాత్మలతో సంభాషించి అంశములను తెలియజేస్తారు. 3. దుష్టగ్రహబాధ నివారణ వుతుంది. సాధారణ వైద్యములకు లొంగని అనేకరోగములు ఆధ్యాత్మిక చికిత్సవల్ల నయమవుతున్నాయి. వివరములు తెలియగోరువారు ఒక రూపాయి ఈకింది చిరునామాకు పంపవలెను.

ఉకుమళ్ల హనుమాయమ్మ

52 వాద్యార సుబ్బరాయమొదలి వీధి

సైదాపేట, మదరాసు 15.